# కుభీర్‌లో పత్తి కొనుగోళ్లకు శ్రీకారం



కుభీర్: కాంటా వద్ద పత్తి వాహనానికి పూజలు చేస్తున్న నాయకులు

కుభీర్, అక్టోబర్ 20 : నిర్మల్ జిల్లా కుభీర్‌లో పత్తి కొనుగోళ్లకు వ్యాపారులు శ్రీకారం చుట్టారు. ఓ ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం పత్తి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. కొనుగోళ్ల ప్రారంభ సమాచారాన్ని తెలుసుకున్న రైతులు వాహనాల్లో పత్తిని మిల్లుకు తీసుకువచ్చారు. ముందుగా పూజలు చేసి క్వింటాల్ పత్తికి రూ.7511 ధరను వ్యాపారులు చెల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మీరా విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ మొహియుద్దీన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎన్నీల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, శంకర్ చౌహాన్, వ్యాపారులు పాల్గొన్నారు

# కొత్త ఓటర్ల నమోదుకు మరో అవకాశం

- ఈ నెల 31 వరకు గడువు పొడిగింపు
- నిర్మల్‌లో ఇప్పటికే 7,11,190 మంది
- మరింత పెరగనున్న ఓటర్లు

నిర్మల్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పించింది. ఓటరు నమోదుకు ఈ నెల 31 చివరి గడువుగా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎవరైనా ఓటరుగా నమోదు కాని వారికి ఇది మంచి అవకాశంగా చెబుతున్నారు. రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం ఈ నెల 9న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో వచ్చే నవంబర్ 30న ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే అధికార యంత్రాంగం గత సెప్టెంబర్ 19 వరకు ఓటరు నమోదుతో పాటు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. ఆయా దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని ఈ నెల 4 న ఓటరు లిస్టును ప్రకటించింది. అయినప్పటికీ, షెడ్యూలు వచ్చిన తర్వాత కూడా చివరి అవకాశంగా ఓటరు నమోదుకు మళ్లీ గడువు పెంచింది. ఈ గడువులో ఫారం నంబర్ 6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు మాత్రమే జరుగుతుంది. ఫారం 7, 8ల ద్వారా మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వలేదు. కాగా ఫారం 6 ద్వారా ఆన్‌లైన్‌లో కాని, లేదా బూత్ లెవెల్ అధికారుల ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అక్టోబర్ 4న విడుదల చేసిన ఓటరు లిస్టు పోలింగ్ కేంద్రాల వారీగా ఉండగా, ఇప్పుడు కొత్తగా నమోదయ్యే వారి లిస్టును సప్లిమెంటుగా ప్రచురిస్తారని అధికారులు చెబుతున్నారు. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఈ నెల 31 వరకు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం అందజేస్తే.. వచ్చేనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకునే మంచి అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించింది.

**జిల్లా వ్యాప్తంగా 7,11,190 మంది ఓటర్లు..**

ఎన్నికల సంఘం ఈ నెల 4న ప్రచురించిన ఓటరు జాబితా ప్రకారం నిర్మల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 7,11,190 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,44,458మంది, మహిళలు 3,66,683 మంది ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 17 మంది, థర్డ్ జెండర్ 49, సర్వీస్ ఓటర్లు 930 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే నిర్మల్‌లో 2,47,495 మంది, ఖానాపూర్‌లో 2,17,665 మంది, ముథోల్ నియోజకవర్గంలో 2,46,030 మంది ఓటర్లు ఉన్నారు. అయితే కొత్త ఓటర్లు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు ఎన్నికల సంఘం గడువు విధించింది. నామినేషన్ల స్వీకరణకు పది రోజుల ముందు వరకు ఓటర్లు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. పొడిగించిన గడువు విషయమై అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తే మంచి ఫలితాలు ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# శాసనసభ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహిద్దాం

- నేడు అసెంబ్లీల వారీగా ఈవీఎంల పంపిణీ
- నిర్మల్ కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నిర్మల్ టౌన్, అక్టోబర్ 20 : నిర్మల్ జిల్లాలో నవంబర్ 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా స్వేచ్ఛయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ భవనంలో ఎన్నికల నిర్వహణ, ఈవీఎం, వీవీప్యాట్ల పంపిణీ, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, తదితర అంశాలపై అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని 906 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌ను నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం మిషన్లు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీల సమక్షంలో వాటిని పరిశీలించి సీజ్ చేశామన్నారు. ఈవీఎం మిషన్లపై అపోహలను తొలగించేందుకు పెద్దఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తామన్నారు. ఈవీఎం ప్యాడ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఓటింగ్‌శాతం పెంచేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో, మున్సిపల్‌లో ప్రత్యేక అవగాహన సదస్సులు, ర్యాలీలు, ఇతర సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ మద్యం, నగదుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్నికల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్వహించే వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని అందుకు అధికారులు, రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మూల నక్షత్రం..భక్తజన కోలాహలం

- ఆరో రోజు కాత్యాయని రూపం
- పెద్దసంఖ్యలో చిన్నారులకు అక్షర శ్రీకారం



కాత్యాయని రూపంలో అమ్మవారు



చిన్నారులకు ఓనమాలు దిద్దిస్తున్న అర్చకుడు

బాసర, అక్టోబరు 20 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. శరన్నవరాత్రోత్సవాలతో పాటు అమ్మవారి ప్రధానమైన మూల నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల ఆరో రోజు సరస్వతీ అమ్మవారు కాత్యాయని రూపంలో దర్శనమిచ్చారు. సర్వసతీ అమ్మవారికి ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్, ఈవో విజయరామారావు పట్టువస్త్రాలు సమర్పించారు. సరస్వతి సేవా సమితి సభ్యులు భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు పలు చర్యలు తీసుకున్నారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్, ముథోల్ సీఐ వినోద్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. 1000 రూపాయల అక్షరాభ్యాసాలు 1740, 150 రూపాయల అక్షరభాస్యాలు 920 మొత్తం 2660, ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా మొత్తం ఆదాయం రూ.33 లక్షలు సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ చైర్మన్, ఈవో



అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి

# ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- శాంతినగర్‌లోని ఈవీఎం గోదాం సందర్శన



ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో

ఎదులాపురం, అక్టోబర్ 20 : శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందని, అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ శాంతినగర్‌లోని ఈవీఎం గోదాంను ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సందర్శించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల కేటాయింపు ఫస్ట్ లెవెల్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల్లో వినియోగించాల్సి ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ల వివరాల గురించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ర్యాండమైజేషన్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్తా శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీవో స్రవంతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు నలంద ప్రియా, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

**పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

ఎదులాపురం, అక్టోబర్ 20 : పత్తి కొనుగోళ్లను ప్రారంభించడానికి అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పత్తి పంటకు కనీస మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభం దృష్ట్యా మార్కెట్ యార్డులలో తూకం మిషన్లను, తేమ కొలిచే యంత్రాలు, మౌలిక వసతులు, తదితర ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ట్రేడర్స్, రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి వారి సూచనలను పరిగణలోకి తీసుకొని త్వరలోనే కొనుగోళ్లను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ట్రేడర్లు, తదితరులు పాల్గొన్నారు.